చూసేవారు లేక.. సర్కారు భూముల దందా!

- రాత్రికి రాత్రే వెలుస్తున్న నిర్మాణాలు
- బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ కేంద్రంగా సాగుతున్న వైనం
- పురపాలికలు, జీపీల్లోనూ జోరుగా అక్రమ కట్టడాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న సంబంధిత శాఖల అధికారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సర్కారు, అసైన్డ్ భూముల ఆక్రమణ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతుండగా.. మరో పక్క పురపాలక సంఘాలు, పంచాయతీల్లో బహుళ అంతస్తు భవనాల అక్రమ కట్టడాలు కూడా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నవ్విపోదురు కాక.. నాకేంటి సిగ్గు అన్నట్లుగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు, భవనాల నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధుల్లోని కొందరు దళారుల అవతారమెత్తి వాటిని విక్రయిస్తూ.. కోట్లకు పడిగెత్తుతున్నారు. రాజకీయ పలుకుబడి, అర్థ, అంగ బలం ఉన్న పెద్దలు కూడా వారికి అండదండగా ఉండటంతో గజాలు కాదు.. ఏకంగా గుంటల కొద్దీ భూములను ఆక్రమిస్తున్నారు. ఈ దందా సంబంధిత అధికారులకు తెలిసినా.. పట్టించుకున్న దాఖలు లేవు.

భూ ఆక్రమణలు.. మచ్చుకు..

- పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ సర్వే నంబర్ 199లోని ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తు భవనాలు వెలుస్తున్నా రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ సర్వే నంబర్‌లో దాదాపు మూడెకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రికి రాత్రే ఇక్కడ ఒకటి, రెండు గదులతో ఇళ్లు నిర్మించి రూ.3 లక్షల నుంచి రూ.10లక్షల వరకు కొందరు మధ్య దళారులు ప్రజాప్రతినిధులు, పలువురు ఉద్యోగుల సాయంతో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- జవహర్‌నగర్‌లోని సర్వే నంబర్లు.137, 377, 583, 586, 598, 647లలోని దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో నకిలీ లేఅవుట్లు సృష్టించి.. ఒక్కో ప్లాట్‌ను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు భూ కబ్జాదారులు విక్రయిస్తున్నారు. పలువురు కార్పొరేటర్లు, నేతలు కీలకంగా వ్యవహరిస్తుండగా.. ఓ ప్రజాప్రతినిధి వారికి గుట్టుగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- బోడుప్పల్‌లోని సర్వే నంబర్ 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా.. దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి ఆక్రమణకు గురవుతోంది. మున్సిపల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందిన బోడుప్పల్ జీపీగా ఉన్న కాలంలో ఓ భూకబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌ను రూ.50 వేల నుంచి రూ.లక్షకు విక్రయించారు. ప్రస్తుతం ఇదే స్థలాన్ని కొందరు రాజకీయ నాయకులు భూకబ్జాదారుల అవతారమెత్తి 60 గజాల నుంచి 80 గజాల ప్లాట్లు ఉండేలా కొత్త లేఅవుట్ సృష్టించి.. ఒక్కో ప్లాట్‌ను గజానికి రూ.10 వేల చొప్పున అమ్ముతూ.. లక్షలు గడిస్తున్నారు. దీనికి గానూ రెవెన్యూ, మున్సిపల్‌లోని పలువురు ఉద్యోగులు మొదలుకొని స్థానిక ఉన్నత స్థాయి అధికారి వరకు ఒక్కో ప్లాట్‌కు రూ.25 వేల నుంచి రూ.లక్ష ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- నాగారంలోని సర్వే నంబర్.297లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా.. రెవెన్యూ శాఖలో చలనం లేదు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు కూడా కబ్జాకు గురయ్యాయి.


బోడుప్పల్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు


పీర్జాదిగూడలో అనుమతులు లేకుండా నిర్మితమవుతున్న బహుళ అంతస్తు భవనాలు

- శామీర్‌పేట్‌లో రియల్టర్లు తమకున్న 45 ఎకరాల భూమికి పక్కన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేసినా స్థానిక రెవెన్యూ అధికారుల్లో చలనం లేదని తెలుస్తోంది.

అనుమతులు లేకుండా నిర్మాణాలు..

- ఎంసీపల్లి మండలం లింగాపూర్ తండా పరిధిలోని రెండున్నర ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్ ల్యాండ్ పేరుతో వెంచర్ చేసి ఒక్కో విల్లాను రూ.60 లక్షల నుంచి రూ.75 లక్షలకు విక్రయిస్తున్నా.. జిల్లా పంచాయతీ శాఖ పట్టించుకోవడం లేదు.
- కొర్రెముల పంచాయతీలో అక్రమ నిర్మాణాలు, వెంచర్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. అంకుషాపూర్‌లో ఓ రియల్టర్ రెండు కాలువలను ఆక్రమించి 30 ఎకరాల్లో వెంచర్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నా.. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ శాఖలు గుడ్లప్పగించి చూస్తోంది తప్ప.. చర్యలు తీసుకోవడం లేదు. ఈ రెండు జీపీలతో పాటు పక్కనున్న ఎదులాబాద్, చౌదరిగూడ, కాచివాని సింగారం, ప్రతాపసింగారంలో కూడా యథేచ్ఛగా బహుళ అంతస్తులు అక్రమ భవన భవనాలు వెలుస్తున్నా.. సంబంధిత అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- జవహర్‌నగర్‌లో ప్రతీ రోజు ఏదో ఒక డివిజన్‌లో అక్రమ కట్టడాలు వెలుస్తున్నా.. పర్సంటేజీల రూపేంలో డబ్బులు పంచుకోవడం మినహాయించి, అడ్డుకట్ట వేసే యోచన లేదు. జవహర్‌గర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా 100 నుంచి 200 వరకు బహుళ అంతస్తులు భవనాలు ఉంటాయని, ఇందులో ముఖ్య ప్రజాప్రతినిధులకు చెందినవి కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఊరుకునేది లేదు. వారెంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పిస్తాం. బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్‌తో సహా జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. అలాగే పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లోనూ ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు చేపడతాం. ఈ మేరకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)ను ఆదేశించాం.

– అమయ్‌కుమార్, కలెక్టర్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

మురుగు సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టండి

ఉప్పల్: చిలుకానగర్ నడి రోడ్డు మీద కుంగిపోయిన మ్యాన్‌హోల్‌తో జలమండలి అధికారులు రెండు రోజులుగా శ్రమిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. ఆధునిక యంత్రాలు వాడుతున్నా సమస్యను పరిష్కరించలేక పోతున్నారు. దీంతో కాలనీలు ఆదర్శ్‌నగర్ ఫేజ్–2, చిలుకానగర్ ప్రధాన రహదారుల్లో రెండు రోజులుగా మురుగు నీరు వరదలా పారుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ గురువారం ఘటన స్థలానికి చేరుకుని మరమ్మతులు స్వయంగా పర్యవేక్షించారు. జలమండి మేనేజర్ సత్యనారాయణను పిలిపించి ఆరా తీశారు. త్వరలో సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, స్థానికులు, కొండలరెడ్డి, జగన్, రామానుజన్, స్వేరేజ్, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.


ఉప్పల్ చిలుకానగర్ రోడ్డులో మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్

తైబజార్‌ను తొలగించాలి

మల్కాజిగిరి: మల్లికార్జున్‌నగర్ ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేస్తున్న తైబజార్‌ను తొలగించాలని బీజేపీ నాయకులు మల్కాజిగిరి సర్కిల్ ఉపకమిషనర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ పార్లమెంట్ విభాగం కన్వీనర్ ఆర్‌కే శ్రీను మాట్లాడుతూ తైబజార్ వ్యాపారులకు బీజేపీ వ్యతిరేకం కాదన్నారు. వ్యాపారులకు వేరే ప్రాంతంలో స్థలాన్ని కేటాయించి ప్రధాన రహదారి నుంచి తొలగించాలని కోరామన్నారు. ట్రాఫిక్ రద్దీ ఉండటంతో పాటు అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. కొంత మంది వ్యాపారులను దృష్టిలో ఉంచుకొని కాకుండా ప్రజలను దృష్టిలో ఉంచుకొని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సదానంద్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, లక్ష్మణ్, చందు, గణ, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవిద్యా హయగ్రీవ హోమం



బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయం ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీవిద్యా హయగ్రీవ హోమాన్ని గురువారం నిర్వహించారు. ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ ద్వారతోరణ పూజ, చతుస్థానార్చన, అగ్నిముఖం, నిత్య పూర్ణహుతి, నిత్యబలి, నివేదన, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



మల్కాజిగిరి: వినాయకనగర్ డివిజన్ సాయినగర్‌కు చెందిన వాణికి మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, టీఆర్ఎస్ అధికార ప్రతినిధి జీఎన్వీ సతీష్‌కుమార్, ఎస్ఆర్ ప్రసాద్, సాయి, పార్థసారథి ఉన్నారు.

ఆశీస్సులు



అల్వాల్: మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ కుమార్తె రాజరాజేశ్వరి వివాహం గురువారం రోహిత్‌కుమార్‌తో తూముకుంట అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ కన్వెన్షన్‌లో వైభవంగా జరిగింది. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హన్మంతరావుతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం



బోడుప్పల్: హేమానగర్ కాలనీ సీపీఐ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కొమురయ్య, సహ కార్యదర్శిగా పుల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా శ్రీశైలం, కవిత, కేదార్, కరణ, స్వామి, ఏషాప్, సురేష్, మంజుల, అనిత, మల్లమ్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హేమానగర్ కాలనీకి చెందిన పలువురు సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో సీపీఐ పార్టీలో చేరారు. ఇందిరానగర్ శాఖ కార్యదర్శి మాచర్ల కనకయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి



అల్వాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తిచేయాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అల్వాల్ డివిజన్ పరిధిలోని పెంటారెడ్డి కాలనీలో రూ.5 లక్షలతో కొనసాగుతున్న వాటర్ సివరేజి పనులను గురువారం ఆమె జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి నిర్మాణ పనుల్లో అధికారులు అలసత్వం వీడాలన్నారు. కవిత పాల్గొన్నారు.

రత్నాల పేరుతో మోసానికి తెర లేపిన ఇద్దరి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ రత్నం

కుషాయిగూడ: రత్నాల పేరుతో మోసానికి తెరలేపిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసిన చేసిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాజీపేటకు చెందిన బల్సుగూరి చందు, యాప్రాల్‌కు చెందిన మేడికొండ సాంబశివరావు అనే ఇద్దరు వ్యక్తులు లక్కీ స్టోన్స్ పేరుతో మోసం చేసి డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశారు. లైట్ అమర్చబడిన ఓ రత్నాన్ని తయారు చేసి ఇది సముద్ర గర్భంగా లభించిన రత్నమని, ఇది జలకాంత రత్నమని దీనికి అద్వితీయ శక్తులు ఉన్నాయని, దీన్ని నీటిలో వేయగానే వెలుగుతుందని మోసానికి తెర లేపారు. దీని విలువ మార్కెట్‌లో సుమారు రూ.2 కోట్లు ఉంటుందని ప్రచారం చేశారు. హైదరాబాద్‌లో అయితే ఎక్కువ విలువ పలుకుతుందని నగరానికి వచ్చి జలకాంత రత్నంపై ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో కుషాయిగూడ డీమార్ట్ సమీపంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో భోజనం చేసి అక్కడ ఈ నకిలీ రత్నాలను రూ.5 లక్షలకు విక్రయించేందుకు బేరం చేస్తున్నారు. దీన్ని గమనించిన ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకుడు ప్రవీణ్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి కారు, సెల్‌ఫోన్లు, నకిలీ రత్నం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో ప్రతి నిరుపేదకు సాయం

– మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఏ–బ్లాక్ అధ్యక్షులు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి, నాచారం డివిజన్ అధ్యక్షుడు వసునూరి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగో రోజు హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. మొదట నాచారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు ముసలి సందీప్‌రెడ్డికి నివాళులర్పించి నాచారం అంబేడ్కర్ విగ్రహం నుంచి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్ల పాలనలో ప్రతి నిరుపేదకు న్యాయం జరిగిందన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధులు మేకల శివారెడ్డి, తౌఫిక్, సెక్రటరీ పసూల ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కంది ఆగిరెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణ ముదిరాజ్, రఘుపతిరెడ్డి, శేఖర్‌గౌడ్, రామ్‌రెడ్డి, మురళీగౌడ్, శేఖర్, మురళీకృష్ణ, శ్రీకాంత్‌గౌడ్, లక్ష్మణ్, బాలరాజు, రఫీక్, అరుణ్, జలీల్ పాషా, అమరేశ్వరి, రామకృష్ణ, ఉమా, విజయభాస్కర్, సందీప్, భాస్కర్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 59 స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కాప్రా: జీవో 59 ద్వారా భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీఓ 59 ద్వారా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నవారు డబ్బులు చెల్లిస్తే వెంటనే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని, ఈ స్పెషల్ డ్రైవ్‌లో దరఖాస్తుల పరిశీలన, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఉప్పల్ మండలం పరిధిలో 221 మంది లబ్ధిదారులకు డిమాండ్ నోటీసులు అందజేశామని, వీరిలో ఇప్పటి వరకు 16 మంది డబ్బులు చెల్లించారన్నారు. లబ్ధిదారులు ఉప్పల్‌లోని సర్వే ఆఫ్ ఇండియా, రామంతాపూర్, మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీ, చైతన్యపురిలో ప్రభుత్వ మీ–సేవ కేంద్రాల్లో మాత్రమే చలాన్లు తీసి తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తుదారులు ఈ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

కుషాయిగూడ: ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఎస్ఐ ప్రసాద్ వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన హనుమంతు వెంకట్(49) కూలీ. ఆర్నెళ్లుగా చర్లపల్లి బీఎన్‌రెడ్డినగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఇంట్లోంచి దుర్వాసన వస్తుండటంతో ఇరుగు పొరుగు వారు కిటికీ తీసి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో తరచూ ఆసుపత్రికి వెళ్లి వచ్చేవాడని ఇంటి యజమాని పోలీసులు తెలిపాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.